

కామారెడ్డిలో కురుస్తున్న వర్షం

జిల్లాలో మోస్తరు వర్షాలు

- రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు
- వానాకాలం పంట సాగు వైపు రైతుల దృష్టి
- నస్రూల్లాబాద్‌లో 73.0 మిమీ వర్షపాతం నమోదు

కామారెడ్డి టౌన్, మే 22(ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్ ప్రారంభమయ్యేందుకు నెలరోజుల సమయం ఉన్నా వర్షాలు మే నెలలోని పడుతుండడంతో ఒక వైపు వరి ధాన్యం అమ్మకానికి తీసుకువచ్చిన రైతులు ఆందోళన చెందుతుండగా మరికొందరు రైతులు వానాకాలం పంటసాగు వైపు దృష్టి సారిస్తున్నారు. గత రెండు రోజుల నుంచి వాతావరణం చల్లబడడంతో జిల్లాలోని దాదాపు అన్ని మండలాల్లో మోస్తర్ వర్షాలు పడుతున్నాయి. యాసంగి సీజన్‌లో ఆరుగాలం కష్టపడి పండించిన పంట వడగండ్ల, అకాల వర్షాలకు నష్టపోవడంతో రైతులు ఈ సంవత్సరం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక అవస్థలు పడుతుండడం, మరికొందరు వానాకాలం సీజన్‌లో అధిక లాభాలు ఇచ్చే పంటలను పండించి యాసంగి పంటలకు చేసిన అప్పులను సైతం తీర్చేందుకు ప్రణాళికలు రచించుకున్నారు. వర్షంతో ఆయా ప్రాంతాలు చిత్తడిగా మారాయి. ఎప్పటిలాగా మున్సిపల్, గ్రామపంచాయతీ అధికారులు పలుచోట్ల పరిశుభ్ర పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మురికినీరు రోడ్లపై పారడం, రోడ్లపై మడుగులు కడుతున్నాయి.

జిల్లాలోని అన్ని మండలాల్లో మోస్తరు వర్షం

జిల్లాలోని దాదాపు అన్ని మండలాల్లో మోస్తరు వర్షం పడుతుంది. గడిచిన 24 గంటల్లో నస్రూల్లాబాద్ మండల కేంద్రంలో 73.0 మీ.మీ., బాన్సువాడ మండలం కొల్లూరులో 71.0 మీ.మీ., భిక్కనూరు మండలంలో 68.0, పిట్లంలో 55.8, మాచారెడ్డి మండలం లచ్చపేటలో 41.5, డోంగ్లీ 40.0, బీబీపేట 39.0, పాల్వంచ మండలం ఇసాయిపేట 34.5, కామారెడ్డి 33, గాంధారి మండలం రామలక్ష్మణ్‌పల్లి 33.5, దోమకొండ 31.8, రాజంపేట మండలం అర్గొండ 28.8, కామారెడ్డి మండలం పాత రాజంపేట 27.5 తదితర మండలాల్లో 20 మీ.మీలకు పైగాన వర్షపాతం నమోదైంది.

సరస్వతీ పుష్కరాలకు బస్సు ఏర్పాటు

కామారెడ్డి టౌన్, మే 22(ఆంధ్రజ్యోతి): సరస్వతి పుష్కరాల సందర్భంగా కామారెడ్డి నుంచి కాళేశ్వరం వరకు సూపర్ డీలక్స్ బస్సును ఏర్పాట్లు చేసినట్లు డిపో మేనేజర్ కరుణశ్రీ తెలిపారు. కామారెడ్డి నుంచి ప్రతీరోజు సాయంత్రం 4 గంటలకు కాళేశ్వరం వరకు బయలుదేరుతుందని తెలిపారు. తిరిగి కాళేశ్వరం నుంచి కామారెడ్డికి ఉదయం 6 గంటలకు బయలుదేరునని తెలిపారు. పెద్దలకు రూ.360, పిల్లలకు రూ.180 చార్జీలు వసూలు చేయనున్నట్లు తెలిపారు.



ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

- జిల్లాలో నకిలీ విత్తనాలపై నిఘా పెట్టిన టాస్క్‌ఫోర్స్
- ఎరువులు, ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు
- రసీదు లేనిదే విత్తనాలు కొనుగోలు చేయొద్దు
- జిల్లాలో 455కు పైగా ప్రైవేట్ ఎరువులు, విత్తనాల దుకాణాలు
- రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు
- జిల్లాలో గతంలో పత్తి, మొక్కజొన్న, సోయా, వరి నకిలీ విత్తనాలు వెలుగు చూసిన వైనం
- నకిలీ విత్తనాలపై రైతులు జాగ్రత్తగా ఉండాలంటున్న అధికారులు

నకిలీ విత్తనాల బెడద

కామారెడ్డి, మే 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మరో పక్షం రోజుల్లో వానాకాలం సాగు ఆరంభం కానున్న నేపథ్యంలో నకిలీ విత్తనాలను అరికట్టేందుకు జిల్లా అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంటుంది. వ్యవసాయ, పోలీసు శాఖల అధికారులు సంయుక్తంగా టాస్క్‌ఫోర్స్‌గా ఏర్పాటై జిల్లాలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను పరిశీలిస్తున్నారు. లైసెన్స్‌లు తీసుకుని దుకాణాలను నడిపిస్తున్నారా.. ఏఏ రకాల విత్తనాలను, ఎరువులను అమ్ముతున్నారు.. వాటికి సంబంధించిన రశీదులు ఉన్నాయా లేదా అని తనిఖీ చేస్తున్నారు. ఏఏ రకాల విత్తనాలు విక్రయిస్తున్నారు, రశీదులు ఇస్తున్నారా లేదా అని ఆరా తీస్తున్నారు. నకిలీ విత్తనాలు, కాలం చెల్లిన విత్తనాలు, ఎరువులు ఉన్నాయా అనే దానిపై నిఘా పెట్టారు.

జిల్లాలో 455కు పైగా ఫర్టిలైజర్స్ దుకాణాలు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో 455కు పైగా విత్తనాలు, ఎరువుల దుకాణాలు ఉన్నట్లు సంబంధిత శాఖాధికారులు చెబుతున్నారు. వానాకాలం సాగు ప్రారంభమవుతున్న నేపథ్యంలో అన్ని మండలాల పరిధిలో ఈ దుకాణాలపై నిఘా పెట్టి టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నారు. ఈ బృందంలో మండల వ్యవసాయశాఖ అధికారితో పాటు ఎస్సై లేదా ఏఎస్సైలు ఉంటారు. ఇరువురు కలిసి అన్ని దుకాణాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. జిల్లాలో అత్యధికంగా వరి, సోయా, మొక్కజొన్న, పత్తి పంటలను రైతులు సాగు చేస్తుండడంతో ఆ పంటలకు సంబంధించిన విత్తనాలను అందుబాటులోకి తీసుకు వస్తున్నారు. వ్యాపారులు నకిలీ విత్తనాలను విక్రయించి రైతులను నష్టం చేకూర్చకుండా చర్యలు తీసుకుంటున్నారు.

విత్తనాలపై రైతులకు అవగాహన

వానాకాలం సాగు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటికే రైతులు ఆయా పంటల సాగుకు విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో నకిలీ విత్తనాలతో రైతులు మోసపోకుండా ఉండేందుకు కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయశాఖ అధికారులు శాస్త్రవేత్తలతో అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా వ్యవసాయాశాఖాధికారి నేతృత్వంలో సహాయ వ్యవసాయశాఖ అధికారులు, మండల స్థాయిలో మండల వ్యవసాయాశాఖ అధికారులు, గ్రామస్థాయిలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు రైతులతో సమావేశాలు నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. వ్యవసాయ రంగంలో పంటల సాగు విధానంలో పంట ఉత్పత్తులను అధికంగా సాధించాలంటే నాణ్యమైన విత్తనాన్ని ఎంచుకోవడం చాలా కీలకమని చెబుతున్నారు. విత్తనాన్ని ఎన్నుకునే క్రమంలో ఆయా భూమి వాతావరణం పరిస్థితులను అనుసరించాలన్నారు. సమీప ప్రాంతాల్లోని వ్యవసాయ పరిశోధన స్థానాన్ని, వ్యవసాయ అధికారులను, విస్తీర్ణ అధికారులను సంప్రదించాలని సూచిస్తున్నారు. కాలనుగుణంగా వివిధ పంటల్లో వేసుకునే విత్తనాలను పలు జాగ్రత్తలతో కొనుగోలు చేయడం రైతులు తమ ప్రధాన విధిగా చూసుకోవాలని చెబుతున్నారు. విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోకుంటే పంటల సాగులో విత్తనం మొలకెత్తకపోవడం ఎక్కువగా తెగుళ్ల, చీడపీడలు రావడం వల్ల పంట నష్టం జరుగుతోంది. మంచి నాణ్యత, మొలకెత్తే శక్తి కలిగిన విత్తనాన్ని ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. విత్తనాలను ఎంచుకునే క్రమంలో కొన్ని జాగ్రత్తలు పాటించి అధికృత విత్తనాలను డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

గతంలో నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులు

వానాకాలం సీజన్ ప్రారంభమయ్యే మొదట్లో టాస్క్‌ఫోర్స్ అధికారులు నకిలీ విత్తనాలపై ఎరువులు, విత్తనాల దుకాణాల్లో తనిఖీలు చేస్తున్నప్పటికీ ఏదో ఒకచోట నకిలీ విత్తనాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. గత సీజన్‌లో నకిలీ విత్తనాలతో చాలా మంది రైతులు నష్టపోయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. గాంధారి, సదాశివనగర్, నస్రూళ్లబాద్, బీర్కూర్, మద్నూర్, పిట్లం, బిచ్కుంద, ఎల్లారెడ్డి తదితర మండలాల్లో సోయా, పత్తి, మొక్కజొన్న, వరి లాంటి విత్తనాలను విత్తినప్పటికీ మొలకలు రాకపోవడం మరికొన్నింటికి పూత, కాయ రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో విత్తనాలను ఎంచుకునే క్రమంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు చెబుతున్నారు.

అర్హులైన ప్రతీ నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు



నాగిరెడ్డిపేటలో ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

నాగిరెడ్డిపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి నియోజకవర్గంలో సొంత ఇల్లు లేని అర్హులైన ప్రతీ నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేస్తామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అన్నారు. ఆయన గురువారం సాయంత్రం నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని వివిధ గ్రామాల ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సొంత ఇల్లు లేని నిరుపేదల కలలు సాకారం చేయడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని అన్నారు. అర్హులైన ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడమే తమ లక్ష్యమని అన్నారు. నాగిరెడ్డిపేట మండలంలో 389 ఇందిరమ్మ ఇల్లు మంజూరైనట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, డీఎల్పీవో సురేందర్, ఎంపీడీవో ప్రభాకర్ చారి, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు రజిత తదితరులు పాల్గొన్నారు.

తాగు, సాగు నీరు అందించడమే లక్ష్యం

సదాశివనగర్: ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని రైతులకు సాగు నీరు, ప్రజలకు తాగు నీరు, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను అందించడమే ఏకైక లక్ష్యంగా పని చేస్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు. కాళేశ్వరం 22వ ప్యాకేజీకి రూ.23కోట్లు మంజూరైనా సందర్భంగా గురువారం భూంపల్లి రిజర్వాయర్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 40సంవత్సరాలుగా ఎలాంటి అభివృద్ధికి నోచుకోని ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతానని అన్నారు. లక్ష ఎకరాలకు సాగు నీరు అందిస్తామని గొప్పలు చెప్పిన గత ప్రభుత్వం తట్టెడు మట్టి కూడా తీయలేదని ఎద్దేవా చేశారు. ఈ ప్రాంత రైతులు కాళేశ్వరం విష యం తన దృష్టికి తీసుకురాగానే నీటి పారుదల అధికారులతో ఎన్నోసార్లు రివ్యూ నిర్వహించి అసెంబ్లీలో ఈ విషయాన్ని పదేపదే ప్రస్తావించడం నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని, సీఎం రేవంత్‌రెడ్డిని చాలా సందర్భాలలో కలిసి ఈ ప్రాజెక్టు కొనసాగే విధంగా కృషి చేయాలనడంతో నిధులు మంజూ రు చేశారన్నారు. రూ.23 కోట్ల నిధుల విడుదలతో భూసేకరణ పూర్తి చేసి పనులు కొనసాగే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ మల్లేష్, డీఈ రమేష్, ఎంపీడీవో సంతోష్‌కుమార్, పార్టీ అధ్యక్షుడు సంగారెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ గంగాధర్, సదాశివరెడ్డి, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు సంగ్యా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఇందిరమ్మ ఇళ్లు

ఎల్లారెడ్డి: కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు కట్టుకునే అవకాశం వస్తుందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. గురువారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో నామమాత్రంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేశారని, వాటి నిర్మాణానికి బిల్లులను పెండింగ్‌లో ఉంచిందన్నారు. మా ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఇళ్లకు బిల్లులు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అందించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, పట్టణ అధ్యక్షుడు వినోద్ గౌడ్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ మారెడ్డి రజితా రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాలకు విద్యను అందించిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ

- కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్



భాగ్యరెడ్డి వర్మ చిత్ర పటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్

కామారెడ్డి టౌన్, మే 22(ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాలకు మెరుగైన విద్యను అందించి విద్యా విప్లవం సృష్టించిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ అని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం ఆయన జయంతి సందర్భంగా ఎస్సీ అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో అధికారికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత బాలికల కోసం పాఠశాలలను స్థాపించి, వారి అభ్యున్నతికి గట్టి పునాదులు వేశారని అన్నారు. సామాజిక కార్యక్రమాలను, ఆది హిందూ ఉద్యమాన్ని ప్రారంభించి అణగారిన హక్కుల కోసం, గుర్తింపు కోసం పోరాటం సాగించారని, గాంధీ గారితో కూడా సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారని తెలిపారు. నిజాం ప్రభుత్వం అడ్వైజర్‌గా కూడా పని చేశారని కొనియాడారు. ఆయన ఆశలకనుగుణంగా ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి రజిత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, డీపీవో తిరుమల ప్రసాద్, జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య, జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి భీమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌డ్యాం పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

- రాష్ట్ర నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ వెంకట కృష్ణ



బీర్కూర్ చెక్‌డ్యాం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

బీర్కూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ పరిధిలోని మంజీరా నదిలో చెక్‌డ్యాం నిర్మాణ పనులను రాష్ట్ర నీటి పారుదల శాఖ నాణ్యత ప్రమాణాల చీఫ్ ఇంజనీర్ వెంకట కృష్ణ గురువారం తనిఖీ చేశారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. బీర్కూర్ మంజీరా నదిలో 28కోట్ల నిధులతో చెక్‌డ్యాంను నిర్మిస్తున్నారు. అయితే పనులు ఎలా కొనసాగుతున్నాయి, ఎంతమేరా పనులు పూర్తి చేశారు, ఇంకా ఎంత మేర పనులు చేపట్టాల్సి ఉంది అనే వివరాలను పరిశీలించడంతో పాటు, కింది స్థాయి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు ఎప్పటిలోగా పూర్తి చేస్తారని అడిగి తెలుసుకున్నారు. పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట నీటి పారుదల శాఖ సీఈ శ్రీనివాస్, ఎస్ఈ రాజశేఖర్, ఈఈ భూమారెడ్డి, డీఈలు దత్తాత్రి, జగదీశ్, ఏఈలు గజానంద్, ప్రణయ్ తదితరులు ఉన్నారు.



వరద గేట్లను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారుల బృందం

నిజాంసాగర్ వరద గేట్లు

మొరాయించకుండా చర్యలు చేపట్టాలి

నిజాంసాగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్లను గురువారం రాష్ట్రస్థాయి క్వాలిటీ కంట్రోల్ ఇంజనీరింగ్ చీఫ్ వెంకటకృష్ణ పరిశీలించారు. వర్షాకాలం దగ్గర పడుతున్నందున గేట్లు మొరాయించకుండా చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టులో ఉన్న 48 వరద గేట్లకు ఆయిలింగ్, గ్రీసింగ్ పనులు చేపట్టారని అడిగి తెలుసుకున్నారు. త్వరలో ఆయిలింగ్, గ్రీసింగ్ పనులను పూర్తి అయినట్లు ఇంజనీరింగ్ చీఫ్‌కు వివరించారు. గేట్లను ట్రయల్ రన్ చేస్తారా అని అడిగిన ప్రశ్నకు ప్రాజెక్టులో నీరు ఉండడంతో ట్రయల్ రన్ చేయలేదన్నారు. ప్రభుత్వం అనుమతి ఇస్తే ట్రయల్ రన్ చేయవచ్చునని అభిప్రాయం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో గేట్లు మొరాయించకుండా చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు. ఆయన వెంట కామారెడ్డి చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, క్వాలిటీ కంట్రోల్ ఎస్సీ భూమారెడ్డి, క్వాలిటీ కంట్రోల్ డిప్యూటీ దత్తాత్రేయ, బాన్సువాడ ఎస్సీ రాజశేఖర్, నిజాంసాగర్ సర్కిల్ ఈఈ సొలంగం అసిస్టెంట్ ఇంజనీర్లు తదితరులున్నారు.



గోల్‌బంగ్లా నుంచి నిజాంసాగర్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న అధికారులు



నిజామాబాద్‌లోని డీసీసీబీ బ్యాంక్

ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీల్లో..

బదిలీలకు పచ్చజెండా

ఐదేళ్లు పూర్తి చేసుకున్న సిబ్బందిని బదిలీ చేయనున్న అధికారులు

నిజామాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలో జరుగుతున్న అవినీతికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. కొన్ని సొసైటీల పరిధిలో లక్షల రూపాయలు గోల్‌మాల్ జరగడంతో ఇప్పటికే చర్యలకు ఉపక్రమించిన అధికారులు సొసైటీలో కార్యక్రమాలు సక్రమంగా జరిగేందుకు చర్యలను చేపట్టారు. దీర్ఘకాలికంగా ఒకేచోట పని చేస్తున్న సిబ్బంది బదిలీకి పచ్చజెండా ఊపారు. ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేసిన సహకార శాఖ అధికారులు ఉమ్మడి జిల్లాల పరిధిలో బదిలీ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటి వరకు ఉన్న నిబంధనలను మార్చి ఐదేళ్ల సర్వీస్ పూర్తయిన ఉద్యోగులను ఉమ్మడి జిల్లా పరిధిలోని సొసైటీలకు బదిలీ చేయనున్నారు. సీనియారిటీని తయారు చేయడంతో పాటు దానికి అనుగుణంగా చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఉత్తర్వుల్లో పేర్కొన్న విధంగా ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలను చేపడుతున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో మొత్తం 143 సహకార సొసైటీలు ఉన్నాయి. వీటిలో నిజామాబాద్ జిల్లాలో 89 ఉండగా, కామారెడ్డి జిల్లా పరిధిలో 54 సొసైటీలు ఉన్నాయి. వీటి పరిధిలో సిబ్బంది పని చేస్తున్నారు. కొన్ని సొసైటీల పరిధిలో సీఈవోలు, స్టాఫ్ అసిస్టెంట్లు ఏళ్ల తరబడి ఒకే స్థానంలో ఉన్నారు. గతంలో కార్యదర్శులుగా పని చేసిన వారినే సీఈవోలుగా నియమించడంతో ఎక్కువ కాలం ఒకేచోట పని చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో సొసైటీలో జరిగే లావాదేవీల్లో కొన్నిచోట్ల ఎక్కువగా అక్రమాలు జరిగాయి. కొన్ని సొసైటీల్లో ధాన్యం కొనుగోలు కమీషన్, ఎరువుల అమ్మకాల వల్ల వచ్చిన నిధులను ఇతర పనులకు మళ్లించారు. మరికొన్ని సొసైటీల్లో పక్కదారి పట్టించారు. కొన్ని సొసైటీలకు సంబంధించిన నిధులను కూడా ఇతర పనులకు ఎలాంటి ఆమోదం లేకుండానే వెచ్చించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సొసైటీల పరిధిలో జరుగుతున్న పనులను పరిశీలించిన మీదట దీర్ఘకాలికంగా పని చేస్తున్న సిబ్బందిని బదిలీ చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సహకార శాఖ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు ఉత్తర్వులను జారీ చేశారు. గతంలో ఉన్న ఉత్తర్వులను మార్చి కొత్త ఉత్తర్వులను జీవో 44 కింద విడుదల చేశారు. ఈ జీవో ప్రకారం ఉమ్మడి జిల్లా పరిధిలో పని చేస్తున్న సొసైటీ సీఈవోలు, స్టాఫ్ అసిస్టెంట్లను బదిలీ చేయనున్నారు. ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారిని ఉమ్మడి జిల్లా పరిధిలోని ఏ సొసైటీకైనా బదిలీ చేయనున్నారు. ఇప్పటి వరకు కొత్త జిల్లాల పరిధిలోనే బదిలి చేయాల్సి ఉన్నా పాత జీవోను మార్చి కొత్త జీవోను విడుదల చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం నిర్ణీత సమయంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ పరిధిలో ఉన్న 143 సొసైటీల పరిధిలో పని చేస్తున్న వీరిని బదిలీ చేయనున్నారు. గతంలో జిల్లా పరిధిలోని కొంత మందిని బదిలీ చేయగా ప్రస్తుతం ఉమ్మడి జిల్లా పరిధిలో చేయనున్నారు. నిజామాబాద్ జిల్లా పరిధిలోని 89 సొసైటీల్లో 360 మంది ఉద్యోగులు పని చేస్తుండగా కామారెడ్డి జిల్లా పరిధిలో 222 మంది సిబ్బంది పని చేస్తున్నారు. వీరిలో ఐదేళ్ల పూర్తి చేసుకున్న వారికి బదిలీ చేయనున్నారు. ఈ బదిలీ కోసం జిల్లా సహకార బ్యాంక్ ఛైర్మన్ ఆధ్వర్యంలో కమిటీ వేయనున్నారు. ఈ కమిటీలో జిల్లా సహకార శాఖ అధికారులతో పాటు ఇతర అధికారులు సభ్యులుగా ఉండనున్నారు. వీరి ఆధ్వర్యంలోనే వారి సర్వీసును పరిశీలించి బదిలీ చేయనున్నారు. రాష్ట్ర సహకార శాఖ తరపున సొసైటీలో పని చేస్తున్న సీఈవోలు, సాఫ్ట్ అసిస్టెంట్ల బదిలీకి ఉత్తర్వులు వెలువడ్డాయని ప్రభుత్వం నుంచి విధివిధానాలు రాగానే చర్యలు తీసుకుంటామని జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారిని జీవోకు అనుగుణంగా ఉమ్మడి జిల్లా పరిధిలోని సొసైటీలకు బదిలీ చేస్తామని తెలిపారు.

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు నాటేందుకు కార్యక్రమం చేపడుతున్న దృశ్యం

బోధన్‌రూరల్,మే22(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. గురువారం ఉమెన్స్ ఫర్ ట్రీస్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్ జూనియర్ కళాశాల మైదానంలో కంపౌండ్ వాల్స్ వెంట మొక్కలు నాటేందుకు స్థలాన్ని పరిశీలించారు. భారత ప్రభుత్వం ప్రారంభించిన ఏక్ పేడ్ మాకే నామ్ కింద మాతృమూర్తులకు ఘనమైన నివాళి అందించేందుకు ఉద్దేశించబడిందని సబ్ కలెక్టర్ పేర్కొన్నారు. ప్రస్తుత వాతావరణంలో వస్తున్నట్టువంటి మార్పులను తట్టుకునేందుకు పట్టణంలో పెరుగుతున్న వేడిని తగ్గించేందుకు బ్లూ, గ్రీన్ మౌలిక సదుపాయలు పెంపొందించేందుకు అమృత మిత్ర కార్యక్రమంలో భాగంగా మహిళ సభ్యులచేత ఉమెన్స్ ఫర్ ట్రీస్ కార్యక్రమం ప్రారంభించబడుతుందన్నారు. మున్సిపల్, పట్టణాల్లో చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాలు, ఖాళీ స్థలాలు గుర్తించి మొక్కలు నాటేందుకు అనువుగా ఉండే స్థలాలను గుర్తించడం జరుగుతుందన్నారు జూన్ 5వ తేది నుంచి ఆగస్టు 31వ తేది వరకు గుర్తించబడిన స్థలాల్లో అమృత మిత్రులచేత చెట్లు నాటడం వాటిని సంరక్షించే కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, మున్సిపల్ డీఈ యోగేష్, అసిస్టెంట్ ఇంజనీర్ ముకాయర్, మెప్మా టీఎంసీ శ్రీనివాస్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు తదితరులు పాల్గొన్నారు.

● ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలి

బోధన్ పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని మున్సిపల్ నల్లాల ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. గురువారం ఉదయం పట్టణంలోని రాకాసిపేట్ ప్రాంతంలో గల వాటర్ ఫిల్టర్ బెడ్‌ను ఆయన సందర్శించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, మున్సిపల్ డీఈ యోగేష్‌లతో మున్సిపల్ సిబ్బంది తదితరులున్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఒకరికి జైలు

కోటగిరి,మే22(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండలంలోని సులేమాన్‌నగర్‌కు చెందిన షేక్ షాలనీ అనే వ్యక్తికి డ్రంకెన్ డ్రైవ్ కేసులో బోధన్ సెకండ్ క్లాస్ న్యాయాధికారి శేషతల్ప సాయి ఒక రోజు జైలుశిక్షతో పాటు రూ.2వేల జరిమాన విధించినట్లు రుద్రూరు ఎస్సై సాయన్న తెలిపారు. ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా షేక్ షాలనీ పట్టుబడ్డారు. గురువారం బోధన్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి నిందితుడికి శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు



మెండోరలో కల్లాల్లో వర్షపు నీటిలో మునిగిన సజ్జ పంట

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేయాలి

ఆర్మూర్ రూరల్, మే 22(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసిపోయిన వరిధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధర అందజేసి కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం మాక్లూర్ మండలంలోని మామిడిపల్లి, గుత్ప, కల్లెడి గ్రామాలలో వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నెలరోజుల క్రితం కోసిన వరిధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టినప్పటికి అధికారులు సకాలంలో కొనుగోలు చేసి ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించకపోవడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోయిందన్నారు. నీటి ప్రవాహంతో కొంత ధాన్యం కొట్టుకపోగా తడిసిన ధాన్యానికి మొలకలు వస్తున్నాయని ఇది రైతులకు నష్టాలకు గురిచేస్తుందన్నారు. ఆరుగాలం కష్టపడిన రైతులు పండించిన ధాన్యాన్ని ప్రకృతి మూలంగా తమకళ్ల ముందే ధాన్యం తడిసిపోతుంటే రైతులు ఆవేదనకు గురవుతున్నరన్నారు. సకాలంలో కొనుగోలు చేసి ధాన్యాన్ని తరలిస్తే రైతులకు ఈ బాధ ఉండేది కాదని సంచులు సకాలంలో అందింక పోవడం, కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించడానికి లారీలు రాకపోవ డంతో పాటు హామాలీల కొరత ఉండడం వల్ల రైతులకు ఈ పరిస్థితి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటి సభ్యుడు గంగాధర్, నాయకులురాములు, రాజు, దినేష్ పాల్గొన్నారు.

డొంకేశ్వర్: మండలంలో గురువారం కురిసిన భారీ వర్షానికి కొనుగోలు కేంద్రాలలోని ధాన్యం తడిసి కొట్టుకుపోయాయి. వరి, నువ్వు, సజ్జ పంటలు నేలవాలాయి. కల్లాలలో రైతులు ఆరబెట్టిన రైతులు తడిసి ముద్దయ్యాయి. గాదెపల్లి, నడ్కుడ, చిన్నయానం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం రాసులు పూర్తిగా తడిసిపోయాయి. ధాన్యంపై కప్పిన తాటిపత్రాలపై నీరు నిల్వగా వాటిని తొలగించేందుకు రైతులు నానా అవస్థలు పడ్డారు.

మెండోర: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు మడంలోని సావెల్ గ్రామంలో ధాన్యం బస్తాలు నీటమునిగాయి. దీంతో నీటిలో మునిగిని ధాన్యం బస్తాల వివరాలను సొసైటీ చర్మన్ మచ్చర్ల రాజారెడ్డి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అధికారులు హుటాహుటిన సావెల్ గ్రామానికి చేరుకుని తడిసిన ధాన్యం బస్తాలను లారీలో మిల్లర్లకు తరలించారు. రైతులు బాధలు సంబంధిత అధికారులు డీటీ శ్రీనివాస్, ఇంచార్జి అబ్దుల్ బారిక్ దృష్టికి సొసైటీ చైర్మన్ తీసుకెళ్లగానే అధికారులు వచ్చి దగ్గర ఉండి పూర్తిగా తడిసిపోయిన ధాన్యం బస్తాలను భారీ వర్షంలోనే తరలించారు. తడిసిన ధాన్యాన్ని మిల్లర్లకు తరలించిన సొసైటీ చైర్మన్, పాలకవర్గం, అధికారులకు రైతులు ధన్యవాదాలు తెలిపారు.

కమ్మర్‌పల్లి, మే22(ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లిలో బుధవారం సాయంత్రం నుంచి గురువారం వరకు ఎడతెరపు లేకుండా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా కల్లాలలో కుప్పలుగా పోసిన వరిధాన్యం వర్షపు నీటిలో మునిగివుంది. వర్షాల కారణంగా బుధవారం సాయంత్రం గట్టు చిన్నఆశమ్మ అనే మహిళకు చెందిన పెంకుటిల్లు కూలిపోయింది.

మెండోర:మండలంలో అకాల వర్షంతో రైతులు పండించిన పంటలు తడిసిముద్దాయ్యయి. పండించిన పంటలను ఎండకు ఎండబెటిట విక్రయించుకుందాం అనుకున్న రైతులకు వర్షంతో తీవ్రంగా నష్టపోయారు. బుధవారం రాత్రి మండలంలో మెండోర, బుస్సాపూర్, వెల్కటూర్ , సావెల్, కోడిచర్ల, దూదిగాం, చాకిర్యాల్‌సోన్‌పేట్ గ్రామాలలో కురిసిన భారీ వర్షా నికి రైతులు పండించిన పంటలు వరి,సజ్జ,పంటలు ఎండబెట్టి విక్రయించే సమయంలో వర్షంపంటలు తడిసిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

కోటగిరి: పొతంగల్ మండలంలోని రాంగంగానగర్ గ్రామంలో వర్షం నీరు ఇళ్లలోకి చేరడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ గంగాధర్ గురువారం గ్రామాన్ని సందర్శించారు. వర్షంనీరు వెళ్లేందుకు వరద కాలువ లేకపోవడంతో సమస్య వచ్చి పడిందన్నారు. జేసీబీని ఏర్పాటు చేసి నీటిని తొలగిస్తామని ఆయన పేర్కొన్నారు. తమ పంట పొలాలకు గ్రామంలోని మురుగునీరు రాకుండా పానాది శుభ్రం చేసి నీటిని తరలించాలని రైతులు కోరారు.

ఆర్మూర్‌టౌన్: తడిసిన వరిధాన్యం పట్ల రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని మార్కెట్ కమిటి చైర్మన్ సాయిబాబా గౌడ్ తెలిపారు. గురువారం వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని రైతులకు అన్యాయం జరుగకుండా అండగా నిలుస్తుందని తడిసిన ధాన్యాన్ని వంద శాతం కొనుగోలు చేస్తుందని ప్రతిపక్షాలు రాద్ధాంతం చేయడం సరికాదని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ వితం జీవన్, డైరెక్టర్ అమృత్‌రావు, కాంగ్రెస్ నాయకుడు ఏలేటి రవికాంత్‌రెడ్డి పాల్గొన్నారు. పట్టణంలోని నిజాంసాగర్ కెనల్ బ్రిడ్జిపై తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని గురువారం రైతులు ధర్నా నిర్వహించారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరిధాన్యం కుప్పలు పూర్తిగా తడిసిపోవడంతో తీవ్రంగా నష్టపోయామని ఉన్నతాధికారులు రైతుల గోసను అర్థంచేసుకొని తడిసిన ధాన్యాన్ని కొనుగోలు అయ్యేల చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతులకు బీజేపీ కిసాన్‌మోర్చ రాష్ట్ర నాయకుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి మద్దతు తెలిపారు.



కమ్మర్‌పల్లిలో వర్షపు నీటిలో ఉన్న ధాన్యపు రాశి



ఆర్మూర్‌లో ధర్నా నిర్వహిస్తున్న రైతులు



సావెల్‌లో వర్షపు నీటిలో మునిగిన ధాన్యం బస్తాలు

ఆర్మూర్ రూరల్: అకాల వర్షాలకు తడిసిన ధాన్యా న్ని వెంటనే కొనుగోలు చేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ నయకులు మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ ఇట్టెడి లింగారెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని అదే విధంగా పంటనష్టపోయిన నువ్వు, టమాట, సజ్జ రైతులకు నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేసిన వరిధాన్యానికి క్వింటాళుకు 500 రూపాయల బోనస్ చెల్లించాలని కోరారు. రైతుల సమస్యలు పరిష్కరించనియెడల రైతుల పక్షాన ఉద్యమిస్తామని ఇట్టెడి లింగారెడ్డి హెచ్చరించారు.

ఆలూర్: ఆర్మూర్‌మండలంలోని వివిధ గ్రామాల్లో గతరెండురోజులు గా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ధాన్యం, సజ్జపంటకు నష్టం వాటిల్లింది.దేగాంలో రైతులు కోసి ఆరబెట్టిన సజ్జలు వర్షాలకు తడిసిపో యాయి. మిర్ధాపల్లి,ఆలూర్,గుత్ప తదితరగ్రామాల్లో ధాన్యంబస్తాలు తడిసిపోయాయి.



ఇందిరమ్మ లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలు అందజేస్తున్న అన్వేష్‌రెడ్డి



అంకాపూర్‌లో లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు



యంచలో భూమిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసుకోవాలి

వేల్పూర్, మే 22(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి సూచించారు. పచ్చలనడ్కుడ గ్రామంలో 54 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా అందులో భాగంగా గురువారం 8 మంది లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీను అన్వేష్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 10 సంవత్సరాలు ఇళ్ల కొరకు ఎదురుచూసిన అర్హులైన నిరుపేదలకు సీఎం రేవంత్‌రెడ్డి ఇందరమ్మ ఇళ్లు మంజూరు చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేగవంతం చేసుకోవాలన్నారు. నిజమైన ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నదే కాంగ్రెస్ లక్ష్యమన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డికి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డికి, బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సునీల్ కుమార్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నవనీత, గ్రామ శాఖ అధ్యక్షుడు గుడాల మోహన్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు టక్కరి గంగాధర్, నాయకులు గట్టువతల నర్సారెడ్డి, ఖాజాఅలీమోదిన్, జెల్ల భూమన్న, లచ్చన్నగారి గంగారెడ్డి, బుల్లెట్ రమేష్, ఏనుగంటి నెహ్రూ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్కొండ: బాల్కొండ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల మార్క్‌అవుట్ గురువారం కాంగ్రెస్ నాయకులు వేశారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు పనులను వెంటనే ప్రారంభించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్, యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు అరవింద్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇమ్రాన్‌ఖాన్, మైనార్టీ అధ్యక్షుడు జావీద్, ఈవో రజనీకాంత్‌రెడ్డి,కుందారపు శ్రీనివాస్,మజార్ రిజాజ్, విద్యాసాగర్, హరికృష్ణ,తేజ, బిట్టు,మేకసతీష్, సన్నీత్‌యాదవ్, నవీన్, పద్మరావు, గోపు ఉషన్న,జోన్‌పాల్, సాయన్న,రియాజ్, వీడీసీ, కాంగ్రెస్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్ : ఆర్మూర్ మండలంలోని అంకాపూర్‌లో గురువారం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీలను ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్, వైస్ చైర్మన్ జీవన్, డైరెక్టర్ అమృత్‌రావు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే ప్రారంభించాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ఆర్మూర్ నియోజకవర్గ ఇంచార్జి వినయ్‌రెడ్డి, మారచంద్రమోహన్‌లకు లబ్ధిదారులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుడు గోపాల్, పంచాయతీ కార్యదర్శి హారిక, జూనియర్ అసిస్టెంట్ చందన లబ్ధిదారులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని యంచలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన పలువురు లబ్దిదారులు తమ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుధారాణి, విజయ్ కుమార్, సాయిలు, ధర్మాజీ, చందరి లక్ష్మణ్, సింధే బాబురావు, లింగం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల:మండలంలో బట్టాపూర్ గ్రామంలో గురువారం ఇందిరిమ్మ ఇండ్ల నిర్మాణానికి మార్కింగ్ వేసినట్లు ఎంపిడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. అందులో భాగంగా గ్రామంలో 26 మంది లబ్ధిదారులకు ఇండ్లు మంజూరీ కాగా నాలుగు ఇండ్లకు గాను మార్కింగ్ వేశామని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం 400 చదరపు అడుగుల నుండి 600 చదరపు అడుగులలోపు ఇంటిని నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖఅధ్యక్షుడు శ్రీనివాస్, కైలాస్, కావ్య, కార్యదర్శిరవిలు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు న్యాయమూర్తిచే న్యాయవిచారణ జరపాలి



సమావేశంలో హాజరైన నాయకులు

నిజామాబాద్ కల్చరల్, మే 22 (ఆంధ్రజ్యోతి):మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు 25 మంది ఆదివాసీలను బూటకపు ఎన్‌కౌంటర్లపై సుప్రీం కోర్టు న్యాయమూర్తిచే న్యాయవిచారణ జరపాలని వివిధ ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. గురువారం జిల్లా కేంద్రంలోని కోటగల్లిలోగల ఎన్ఆర్ భవన్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో సీపీఐ, సీపీఐఎం, సీపీఐఎంఎల్, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ న్యూడెమొక్రసీ, బహుజన సమాజ్ పార్టీ, పౌరసంఘాల సంఘం, పౌరహక్కుల వేదిక ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో రమేష్‌బాబు, వనమాలకృష్ణ, ఓమయ్య, ఆకుల పాపయ్య, ఎడ్ల రాములు, సరితలు హాజరై మాట్లాడుతూ కేశవరావుతో పాటు ఆదివాసీలను ఎన్‌కౌంటర్‌లో హత్య చేయడం కార్పొరేట్ కంపెనీల కోసమేనని వారు అన్నారు. అడవి ప్రాంతంలో నిక్షిప్తమైన ఖనిజ సంపదను స్వదేశీ, విదేశీ కార్పొరేట్ కంపెనీలకు అప్పచెప్పడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్‌కౌంటర్లను ప్రోత్సహిస్తుందని అన్నారు. అడవి నుంచి నక్సలైట్లను ఏరివేయడానికి 20వేల మంది పోలీసు బలగాలను మొహరించి నక్సలైట్లతో పాటు ఆదివాసీ ప్రజలను వారి సాంప్రదాయాలను జీవన విధానాన్ని ధ్వంసం చేస్తున్నాయని అన్నారు. ప్రశ్నించేతత్వాన్ని, ప్రశ్నించే మనషులను చంపినట్లుగా నక్సలైట్లను రూపుమాపలేరని అన్నారు. ఈ కార్యక్రమంలో జలేందర్, ప్రవీణ్, రమేష్, అన్వేష్, వెంకన్న, భూమయ్య, శివ, గణేష్, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ ఎక్కిన దంపతులు



ట్యాంకు పైకి ఎక్కిన దంపతులు

రామారెడ్డి, మే 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం కుటుంబ సభ్యులు, బంధువుల తగాదాలతో విరక్తి చెంది భార్యాభర్తలు వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వెంటనే స్పందించిన రామారెడ్డి ఎస్సై నవీన్ చంద్ర పోలీసుల బృందంతో వాటర్ ట్యాంక్ వద్దకు వెళ్లి భార్యాభర్తలకు నచ్చజెప్పారు. వాటర్ ట్యాంక్ పైకెక్కి భార్యాభర్తలను దింపారు. పోలీస్‌స్టేషన్ లో నాలుగు గంటల పాటు విచారణ జరిపి కుటుంబ సభ్యులను, బంధువులను పిలిపించి పూర్తి వివరాలు తెలుసుకొని రామారెడ్డి గ్రామానికి చెందిన లక్కాకుల శంకర్ భార్య అరుణ ను ఒప్పంద పత్రం రాయించుకుని వదిలిపెట్టారు. పోలీస్ స్టేషన్‌కు ఫైళ్ల చూసేందుకు వచ్చిన ఎస్పీ చైతన్య రెడ్డి సైతం వాటర్ ట్యాంక్ ఎక్కిన భార్యాభర్తలను పిలిపించుకొని మాట్లాడారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి : ఏఎస్పీ చైతన్యరెడ్డి

రామారెడ్డి, మే 22 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసులు విధులు సక్రమంగా నిర్వహించాలని కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి పేర్కొన్నారు. రామారెడ్డి పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామానికి ఒక కానిస్టేబుల్ ఉన్నప్పుడు ఎప్పటికప్పుడు అన్ని సమాచారాలను అందుకోవాలని సూచించారు. అనంతరం పెండింగ్ కేసులను త్వరగా పూర్తిచేయాలని కోరారు. ఫైళ్ల తనిఖీ చేసి పలు సలహాలు, సూచనలు, పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో రామారెడ్డి ఎస్సై నవీన్ చంద్ర, ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుల్స్, పోలీసులు పాల్గొన్నారు.

వినియోగదారులకు చట్టాలపై అవగాహన అవసరం

బాల్కొండ , మే 22(ఆంధ్రజ్యోతి): వినియోగదారులు చట్ట పరమైన చట్టాలను ప్రజలకు అవగాహన కలిగి ఉండాలని అఖిల భారత వినియోగదారుల వెల్ఫేర్ కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజుల రామనాథం అన్నారు. గురువారం అంతర్జాతీయ లీగల్ మెట్రాలజీ ఉత్సవాలను పురస్కరించుకొని నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలంలోని పాండురంగ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించిఅవగాహన కల్పిం చారు.

'బీజేపీ కార్యకర్తలకు అండగా ఉంటుంది'

బోధన్‌రూరల్, మే 22(ఆంధ్రజ్యోతి): బీజేపీ పార్టీ కార్యకర్తలకు ఎప్పుడు అండగా ఉంటుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డీ మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని రంగర్‌గల్లీకి చెందిన మల్లెపూల గంగాధర్ కటుంబాన్ని పరామర్శించారు.

ఈత నేర్చుకోవడానికి వెళ్లి బాలుడి మృతి

వర్ని, మే 22 (ఆంధ్రజ్యోతి): వర్ని మండలం సిద్దాపూర్ గ్రామానికి చెందిన బర్దవల్ తాన్‌సింగ్(13)గురువారం ఈత నేర్చుకోడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. వేసవి సందర్భంగా స్నేహితులతో కలిసి బావులు, కాలువల వద్దకు వెళ్లినట్లు ఎస్సై తెలిపారు. ఈ క్రమంలో ఈత రాక బాలుడు మృతి చెందినట్లు చెప్పారు. మృతుడి తండ్రి రాంచందర్ ఫిర్యాదు మేరకు బాలుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

జాకోరలో బాలిక దృశ్యం

వర్ని, మే 22(ఆంధ్రజ్యోతి): వర్ని మండలం జాకోర గ్రామానికి చెందిన 14ఏళ్ల బాలిక అదృశ్యం అయినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. వారం రోజులుగా సదరు బాలిక కనిపించకపోవడంతో తల్లి అనిత ఫిర్యాదు మేరకు గురువారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

కల్లెడిలో బస్‌షెల్టర్ నిర్మాణానికి భూమిపూజ

ఆలూర్, మే 22(ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండలం కల్లెడిలో నిర్మిస్తున్న బస్‌షెల్టర్ పనులకు కాంగ్రెస్ నాయకులు గురువారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి డేగ పోశెట్టి, నాయకులు నీలగిరి శ్రీనివాస్, నర్సరెడ్డి, ఎడ్ల పోశెట్టి, రామకృష్ణ, శ్రీనివాస్, గంగారాం, వెంకటేష్, శివకృష్ణ, సిరికొండ మహేష్, పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో మునిగి జాలరి మృతి

నవీపేట, మే 22(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ మండలం పాల్దాకు చెందిన వన్నెల నారాయణ(59)అనే జాలరి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతిచెందాడని ఏఎస్ఐ మోహన్ రెడ్డి తెలిపారు. నారాయణ బుధవారం సాయంత్రం స్థానిక చెరువులో చేపలు పట్టడానికి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదని అన్నారు. గురువారం సాయంత్రం అతడి మృతదేహం స్థానిక చెరువులో లభ్యమైందని, చేపలు పట్టడానికి వెళ్లిన సమయంలో అతడికి వల చుట్టుకోవడం ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడని ఏఎస్ఐ వివరించారు. మృతుడి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారని, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

బోధన్ లయన్స్ క్లబ్ సేవలు చరిత్రలో నిలిచిపోతాయి

బోధన్‌రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): బోధన్ లయన్స్ క్లబ్ సేవలు చరిత్రలో నిలిచిపోతాయని ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ మనోజ్‌షా(కెన్యా) అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని లయన్స్ క్లబ్ కంటి ఆసుపత్రిని కుటుంబ సభ్యులతో సందర్శించారు. ఈ సందర్భంగా బోధన్ లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలను కొనియాడారు. ఏడు సంవత్సరాల నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ రంగాలలో సేవలందిస్తున్న బోధన్ లయన్స్ క్లబ్ తమ దేశంలోనే లేదని ఇది చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు.

కాలనీలు జలమయం

ఇందల్వాయి, మే 22 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఇందల్వాయి బస్టాండ్ గురువారం నీటిమయంగా మారింది. బస్టాండ్ ముందర గుంతలు ఉండటంతో చిరుజల్లులకే బురదనీరు గుంతల్లో చేరి ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. బస్టాండ్‌లో ఉన్న వ్యాపారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. వేగంగా వచ్చే బస్సు తాకిడికి గుంతలో నిలిచిన బురదనీరు దుకాణాలు, ప్రయాణికుల మీద పడుతుండటంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలుసార్లు ఆర్టీసీ అధికారులకు విన్నవించినా నామమాత్రం మట్టినిపోసి చేతులు దులుపుకుంటున్నారు. ప్రతీనెల లక్షల్లో ఆర్టీసీకి ఆదాయం వస్తున్నా బస్టాండ్ సమస్యలు ఏమీ పట్టనట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్‌లో నీరు నిలువకుండా గుంతలను పూడ్చివేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నందిపేట: మండలంలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జోరు వాన కురిసింది. ఉదయం 8.30గంటల నుంచి సాయంత్ర 6.20 గంటల వరకు 43.2 ఎంఎం వర్షాపాతం నమోదైంది. మే నెలలో చెడగొట్టు వానల్లో ఇదే భారీ వర్షం. జోరు వాన కారణంగా రోడ్లు జలమయం అయినాయి. మురికి కాలువలలో వర్షం నీరు పట్టక రోడ్లపైకి వచ్చాయి. సుమారు మూడు నుంచి నాలుగు గంటల పాటు ప్రజలు ఎవ్వరు రోడ్లపైకి రాలేకపోయారు. ఈ జోరు వానతో అప్పుడు వర్షా కాలం మొదలైందని ప్రజలు భావిస్తున్నారు.

బోధన్‌రూరల్ : బోధన్ డివిజన్‌లో బుధవారం అర్థరాత్రి నుండి వర్షపు నీరు భారీగా కురుస్తుంది. గురువారం ఉదయం నుండి వర్షం ఈదురు గాలులతో కురుస్తుంది. వర్షానికి రాకాసిపేట్ తదితర లోతట్టు ప్రాంతాలలో నివాసాల వద్దకు వర్షపు నీరు చేరింది, పలు చోట్ల రోడ్లపై వర్షపు నీరు పొంగిపొర్లి రోడ్లపై ప్రవహించింది. వర్ని మండలంలో 62.0మిల్లి మీటర్ల వర్షపాతం నమోదైంది. రెంజల్ మండలంలో 12.2మిల్లి మీటర్లు, కోటగిరిలో 36.8మిల్లి మీటర్లు, బోధన్‌లో 38.4మిల్లి మీటర్లు, మోస్రాలో 16.2మిల్లి మీటర్లు, ఎడపల్లిలో 21.0మిల్లి మీటర్లు, రుద్రూరులో 48.2మిల్లి మీటర్లు, చందూర్‌లో 37.6మిల్లి మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు.

కోటగిరి : కోటగిరి, పొతంగల్ మండలాల్లో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. కోటగిరి మండలంలో 36.8మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, పొతంగల్ మండలంలో 39.6మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షానికి రోడ్లన్నీ చిత్తగా మారాయి., పంట పొలాల్లో స్వల్పంగా వర్షం నీరు చేరింది. భారీ వర్షానికి బోధన్, సుంకిని రహదారి బురదమయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ప్రయాణికులు ఎదుర్కొంటున్నారు. పొతంగల్ మండలంలోని రాంగంగానగర్‌లో వర్షంనీరు ఇళ్లలోకి చేరింది. భారీ వర్షం కురియడంతో రోడ్డుకు అటు వైపుగా వెళ్లాల్సిన నీరు కాలువ లేకపోవడంతో మురికి కూపంగా మారింది. వర్షానికి వరద నీరు ఇళ్లలోకి చేరింది. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరారు.



నందిపేటలో వర్షం నీరు

నవీపేట : నవీపేట మండలంలో గురువారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉ ండగా మధ్యాహ్నం సమయానికి వాతావరణం పూర్తిగా చల్లబడింది. మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు భారీ వర్షం కురియడంతో పల్లపు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. ఇదిలా ఉండగా గురువారం నవీపేట మండలంలో 38మిల్లి మీటర్ల వర్షపాతం కురిసినట్లు నమోదైందని అధికారులు పేర్కొన్నారు.

ఆర్మూర్ టౌన్ : మున్సిపల్ పరిధిలోని కురిసిన వర్షానికి పలు కాలనీలు జలమయమయ్యాయి. గత మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు డ్రైనేజీలలో చెత్తచేరి రోడ్లపై మురికి నీరు పారింది. హుస్నాబాద్ కాలనీలలో 35వ వార్డులో డ్రైనేజీలు నిండి షాపులు ఇంటిముందట నీరు నిలిచింది. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

రామారెడ్డి, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు మండలస్థాయి ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం మూడో రోజు నిర్వహించారు. రామారెడ్డి మండల కేంద్రంలో ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో నిట్టూరి ఆనంద్ రావు మాట్లాడారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించి విద్యార్థిని, విద్యార్థులకు బోధించాలని తెలిపారు.

బోధన్‌రూరల్ : బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లిలో గల ఇందూర్ బీఈడీ కళాశాలలో ఐదు రోజులుగా ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎంబెల్లి శంకర్, ఉపాధ్యాయులు ధన్‌రాజ్, గంగాధర్, వీరేష్, అభయేందర్, నిజాముద్దీన్, లలిత, వాసవి, వెంకటేశ్వర్ రావు, హన్మాండ్లు, శ్రీహరి, సంజీవ్, వరలక్ష్మి, శ్రీధర్, గోవర్ధన్, పీరాజి, నాగేష్, సీఆర్‌పీలు తదితరులున్నారు.


బడిబాట సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బడిబాట లక్ష్యం నెరవేరేనా?

- ప్రణాళిక సిద్ధం చేసిన విద్యాశాఖ
- జూన్ 6 నుంచి 19 వరకు కార్యక్రమాలు
- సర్కార్ బడుల్లో సంఖ్య పెరిగేనా..!?

పెద్దకొడప్‌గల్, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు గాను ప్రభుత్వం ప్రతీ సంవత్సరం జూన్ నెలలో ఆచార్య జయశంకర్ పేరిట బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమంలో భాగంగా కొత్త విద్యార్థులు పాఠశాలల్లో చేరే విధంగా చర్యలు తీసుకుంటారు. జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో భాగంగానే ఆయా గ్రామాల్లో గల విద్యార్థులు ప్రయివేట్ పాఠశాలలకు వెళ్లకుండ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విధంగా కార్యచరణ రూపొందించి అందుకు అనుగుణంగా కమిటీలు వేసి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ప్రతీ సంవత్సరం జూన్ 2న ప్రారంభమయ్యే బడిబాట కార్యక్రమం జూన్ 19న ముగుస్తుంది. గత సంవత్సరం బడిబాట కార్యక్రమం సందర్భంగా ఆయా గ్రామాలలో నూతనంగా విద్యార్థులు బడిలో చేరిన అందులో కొంతమంది బడిబాటను మరిచిపోయారు. తిరిగి వీరిని స్థానికంగా ఉన్న సిఆర్‌పిలు పాఠశాలల్లో చేర్పించారు. దీంతో పాటుగానే బడిబాటలో భాగంగా స్థానికంగా అంగన్‌వాడీ పాఠశాలల్లో చదివి 5 ఏళ్లు పూర్తయిన విద్యార్థులను ప్రాథమిక పాఠ శాలల్లో చేర్పించాలి.

విద్యార్థుల సంఖ్య ను పెంచాలని లక్ష్యంతో ప్రణాళిక

గత సంవత్సరం జిల్లాలోని చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత కారణంగా ఆయా గ్రామాలలో గల విద్యార్థులు ప్రయివేట్ పాఠశాలల్లో చేరారు. దీంతో ఈ విషయంపై దృష్టి సారించిన ప్రభుత్వం ఉపాధ్యాయులు నియామకంతో పాటు పాఠశాలల్లో అవసరమైన ప్రాథమిక సౌకర్యాలను గుర్తించి వాటిని పూర్తి చేసింది. అప్పటికే విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడవడంతో విద్యార్థులు ప్రయివేట్ వైపు మొగ్గు చూపారు. ఈ సంవత్సరం అన్ని పాఠశాలల్లో పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులు ఉండటం, సౌకర్యాల కల్పన కూడా బాగుండటంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని లక్ష్యంతో ప్రణాళిక రచించారు. అంతేగాక ప్రభుత్వం పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ప్రాథమిక దశ నుంచే ప్రారంబిస్తున్నారు. మారుమూల గ్రామాల పాఠశాలల్లో కూడా ఇంగ్లీష్‌ను విద్యార్థులకు అలవాటు చేస్తున్నారు.

ఇప్పటికే ప్రారంభమైన ప్రైవేట్ పాఠశాలల ప్రచారం..

జిల్లాలో దాదాపుగా అన్ని మండల కేంద్రాలలో ప్రభుత్వం పాఠశాలలతో పాటు ప్రయివేట్ పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రచారం ఇంక ప్రారంభ కాకపోయినప్పటికీ ప్రయివేట్ పాఠశాలల నిర్వాహకులు మాత్రం ఈ పాటికే ప్రచారంతో ఊదరగొడుతున్నారు. తమ పాఠశాలల్లో విద్యార్థులను జాయినింగ్ చేస్తే వివిధ కోర్సులతో పాటు, ఉన్నత చదువులకు అవసరమయ్యే నీట్, జెఈఈ, ఎంసెట్ వంటి వాటికి ఇప్పటి నుండే శిక్షణ అందిస్తామని ప్రచారం చేస్తు దూసుకుపోతున్నారు. అంతేగాక తమ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పిస్తే ఫీజుల్లో రాయితీ కల్పిస్తామని ఆశ చూపుతున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో గత సంవత్సరం విద్యార్థుల సంఖ్య తగ్గడానికి కారణమైంది. మరి ఈ సారి సమస్యలను అధిగమించి విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే మరి.

బడిబాట కార్యక్రమం వివరాలు..

- జూన్ 6 గ్రామ సభ నిర్వహణ
- జూన్ 7 ప్రతీ ఇంటిని సందర్శించి బడి ఈడు పిల్లల గుర్తింపు
- జూన్ 8 నుంచి 10 వరకు కరపత్రాలతో ఇంటింట ప్రచారం, అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన, డ్రాపవుట్ పిల్లలను గుర్తించి చేర్పించడంతో పాటు, ప్ర త్యేక అవసరాలు ఉన్న పిల్లలను గుర్తించి అందుబాటులో ఉన్న పిల్లలను భవిత కేంద్రాలలో చేర్పించాలి.
- జూన్ 11వ తేదీన 6 నుంచి 10 తేదీ వరకు నిర్వహించిన కార్యక్రమాలపై సమీక్ష.
- జూన్ 12 అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను ప్రజా ప్రతినిధులతో ప్రారంభించాలని, అదే రోజు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం లను అందజేయడం.
- జూన్ 13 సామూహిక అక్షరాభ్యాసం, బాలల సభ నిర్వహణ.
- జూన్ 16 ఎఫ్ఎల్ఎన్ మరియు లిప్ దినోత్సవం నిర్వహించడం
- జూన్ 17న విలీన విద్య, బాలిక దినోత్సవం నిర్వహణ.
- జూన్ 18 తరగతి గదులు డిజిటలీకరణపై అవగాహన, మొక్కల పెంప కంపై విద్యార్థులకు అవగాహన.
- జూన్ 19 బడిబాట ముగింపు సందర్భంగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహణ.

రవీంద్రభారతిలో అంకాపూర్ విద్యార్థిని నృత్య ప్రదర్శన



రవీంద్రభారతిలో నృత్యం చేస్తున్న జయారెడ్డి

ఆర్మూర్ రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): అంకాపూర్‌కు చెందిన 8ఏళ్ల చిన్నారి జయారెడ్డి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గురువారం రాత్రి నాట్య ప్రదర్శన చేశారు. కేవలం ఆరు రోజుల పాటు శిక్షణ పొందిన జయారెడ్డితో లిప్రయత్నంలోనే రవీంద్ర భారతిలో నృత్య ప్రదర్శనతో అందరి మన్ననలు అందుకుంది. జయారెడ్డి ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి మనుమరాలు, ఆర్ఆర్ ఫౌండేషన్ డైరెక్టర్ పైడి సుచరిత రెడ్డి కూతురు జయారెడ్డి అద్భుత ప్రదర్శనను ప్రముఖ కూచిపూడి నాట్యచార్యులు ఏలేశ్వరపు చలపతిశాస్త్రీ, ప్రముఖ నటుడు దైవజ్ఞ శర్మ ప్రశంసించి జ్ఞాపిక, సర్టిఫికెట్ ప్రదానం చేశారు.


పెద్దవాగు బ్రిడ్జ్ సమీపంలో మోతె మూలమలుపు వద్ద కూలడానికి సిద్ధంగా ఉన్న కల్వర్టు


వాహనదారులకు కన్పించకుండా రోడ్డుకు సమానంగా ఉన్న కల్వర్టు


పచ్చల నడ్కుడ అంగడిబజార్ సమీపంలో శిథిలావస్థకు చేరి పైపుల్లో చెత్తచెదారంతో నిండిపోయిన దృశ్యం

శిథిలావస్థలో కల్వర్టులు.. తరచూ ప్రమాదాలు

- జంకుతున్న వాహనదారులు
- పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు

వేల్పూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలంలోని పలు గ్రామాల మీదుగా ఉన్న ప్రదాన రహదారులకు నిర్మించిన కల్వర్టులు శిథిలావస్థకు చేరుకొని ప్రమాదకరంగా మారుతున్నాయి. కల్వర్టులు రోడ్డుకు సమాన ఎత్తులో ఉన్నందున అది గమనించని వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రమాదాలు చాలా జరుగుతున్నప్పటికి కల్వర్టుల ఎత్తు పెంచడం, మరమ్మత్తులు చేపట్టడం వంటి పనులను సంబందిత అధికారులు చేపట్టకపోవడం పట్ల మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ తోట పొలాల నుంచి వచ్చే వర్షపు నీరు, చెరువు కాలువల నుంచి వచ్చే నీరు రోడ్డు అడుగుబాగం నుంచి వెళ్లేందుకు వీలుగా పైప్‌లైన్ వేసి అక్కడ ఇరువైపులా ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు గాను కల్వర్టులు నిర్మించారు. కానీ కల్వర్టులు చాలా వరకు ప్రస్తుతం శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్దంగా ఉన్నాయి. అంతేకాకుండా గత కొన్నేళ్ల క్రితం నిర్మించిన కల్వర్టులు ప్రస్తుతం రోడ్డుకు సమానంగా ఉండడం వల్ల గమనించని వాహనదారులు ప్రమాదాలకు గురవుతూ ప్రాణం నష్టం జరిగిన సంఘటనలు పలు ఉన్నాయి. 63వ జాతీయ రహదారినుంచి వేల్పూర్ మీదుగా భీమ్‌గల్‌కు వెళ్లే రోడ్డులో చాలాచోట్ల కల్వర్టులు ప్రమాదాలు జరుగడానికి దగ్గరిగా ఉన్నాయి. వేల్పూర్ పెద్దవాగు సమీపంలో మోతెకు వెళ్లే మూలమలుపు వద్ద కల్వర్టు అతిప్రమాదకరంగా ఉంది. ఇటీవలే భారీ వర్షాలకు మోతె పెద్దచెరువు నుంచి అలుగు పారి ఈ కల్వర్టు దెబ్బతినడంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ కల్వర్టు స్థానంలో కొత్తగా కల్వర్టు నిర్మించడానికి నిధులు మంజూరు చేసింది. కల్వర్టుకు మంజూరైన నిధులు ప్రస్తుత ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. గోవింద్‌పేట్ నుంచి జాన్కంపేట్, పచ్చలనడ్కుడ మీదుగా భీమ్‌గల్‌కు వెళ్లే ప్రదాన రహదారిలో ఉన్న కల్వర్టు చాలా వరకు రోడ్డు లేవల్‌లో సమానంగా ఉండడం వల్ల వాహనదారులు ప్రమాదాల భారీన పడుతున్నారు. పచ్చల నడ్కుడ అంగడి బజార్ సమీపంలో జాన్కంపేట్ గ్రామ సమీపంలోని పలుగు కింద ఉన్న కల్వర్టులు శిథిలావస్థకు చేరుకోవడమే కాకుండా అడుగు భాగంలో వేసిన పైపులు, సిమెంట్ గోడలు పగుళ్లు ఏర్పడి చెత్త చెదారంతో నిండిపోయాయి. దీంతో రానున్న వర్షకాలంలో వర్షపు నీరు కల్వర్టు కిందినుంచి ప్రవహించకుండా రోడ్లపైకి నీరుపారే అవకాశాలు కన్పిస్తున్నాయి. వేల్పూర్ మీదుగా, పచ్చల నడ్కుడ మీదుగా భీమ్‌గల్ వెళ్లే ప్రదాన రహదారులపై నిత్యం వందలాది వాహనాలు భారీ వాహనాలతో పాటు వెళ్తుంటాయి. దీంతో కల్వర్టులు శిథిలావస్థకు చేరిన కల్వర్టులు ఎప్పుడు కూలుతాయోనని వాహనదారులు, ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు సమానంగా ఉన్న కల్వర్టులను వాహనదారులకు కన్పించే విధంగా సరైన ఎత్తులో నిర్మించి, శిథిలావస్థలో ఉన్న కల్వర్టుల స్థానంలో కొత్తగా కల్వర్టులు నిర్మించి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.

కొత్తగా కల్వర్టులు నిర్మించాలి..

పాలెపు బాల్‌రాజ్, మోతె



మండలంలో పలు గ్రామాల మీదుగా ఉన్న ప్రదాన రహదారులకు అవసరమైన చోట కొత్తగా కల్వర్టులను నిర్మించాలి. గత కొన్నేళ్ల క్రితం నిర్మించిన కల్వర్టులు ప్రస్తుతం శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్దంగా ఉన్నాయి. వాటిని తొలగించి వాహనదారులకు కన్పించే విధంగా ఎత్తులో కొత్తగా కల్వర్టులు నిర్మించి ప్రమాదాలు జరుగకుండా చూడాలి. గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేసిన కల్వర్టులకు ప్రస్తుత ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి.


జేసీబీ సహాయంతో మొరం తవ్వుతున్న దృశ్యం

ఆగని ఇసుక, మొరం దందా

● ఇందల్వాయిలో జేసీబీలతో తోడేస్తున్నారు ● అధికారుల తనిఖీలు అంతంత మాత్రమే

ఇందల్వాయి, మే 22 (ఆంధ్రజ్యోతి): ఇందల్వాయి మండలంలోని లింగాపూర్ వాగు నుంచి ఇసుక, మొరం అక్రమ రవాణా జోరందుకుంది. ప్రతీరోజు ఉదయం, రాత్రి తేడా లేకుండా ఏకంగా జేసీబీలను పెట్టి ఇసుక, మొరంను దోచేస్తున్నారు. పర్మీషన్ పేరుతో జేసీబీలను పెట్టి అక్రమ ఇసుక, మొరం రవాణా చేస్తున్నా రెవెన్యూ, మైనింగ్ సిబ్బందికి తెలిసిన అవేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఒకవైపు భూగర్భ జలాలు ఇంకిపోయి పంటలు ఎండుతుంటే అక్రమ ఇసుక, మొరం రవాణాకు అడ్డుకట్ట వేసేది ఎవరని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ పథకాల పేరిట అక్రమ రవాణా చేస్తూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు.

అడుగంటిన భూగర్భ జలాలు

వేసవి కాలంలో ఇళ్ల నిర్మాణం జోరందుకోవడంతో ఇసుక, మొరం అక్రమ రవాణాకు అడ్డు అదుపు లేకుండాపోయింది. దీంతో విచ్చలవిడిగా ఇసుక, మొరం రవాణా చేస్తుండటంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి వరి, పంట పొలాలు పర్యావరణం దెబ్బతింటున్నాయి.

ప్రభుత్వ పనుల పేరిట రవాణా

ప్రభుత్వ పనుల పేరిట నామమాత్రపు డీడీలు కట్టి వందల సంఖ్యలో ఇసుక, మొరం ట్రిప్పులను కొడుతున్నారు. ప్రతీరోజు లింగాపూర్, గౌరారం వాగుల నుంచి యధేచ్ఛగా ఇతర మండలాలకు సైతం ఇసుక, మొరం



రవాణా చేస్తున్నారు. పర్మీషన్ తీసుకున్నామని చెప్పి రాత్రివేళలో సైతం ఇసుకను తరలిస్తున్నారు. గతంలో తీసుకున్న డీడీలను చూపుతూ ఇసుకను తరలిస్తున్నారు. ఇసుక, మొరం పర్మీషన్ కావాలంటే స్థానిక తహశీల్దార్, గణులశాఖ, జలవనరుల శాఖ, మైనింగ్ పర్మిషన్ తీసుకోవాలి. కాని అవేమి ఇసుక బకాసరులు పట్టించుకోవడం లేదు. యదేచ్ఛగా అక్రమ రవాణా చేస్తూ ఖాళీ స్థలంలో డంప్‌లను నిలువ చేస్తున్నారు.

గతంలో అడ్డుకున్న తండావాసులు

లింగాపూర్ వాగు నుంచి జేసీబీ ద్వారా ఇసుక రవాణాను పాటితాండా వాసులు గతంలో అడ్డుకున్నారు. జేసీబీ సహాయంతో రాత్రింభవళ్లు ఇసుక రవాణా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాండావాసులు వాగులోకి వెళ్లగా ట్రాక్టర్ యజమానులు పారిపోవడంతో జేసీబీలను పట్టుకొని తహశీల్దార్‌కు సైతం ఫిర్యాదు చేశారు.

అనుమతి లేని వాహనాలను సీజ్ చేస్తాం..

రెవెన్యూ అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

అక్రమంగా జేసీబీలతో ఎవరూ ఇసుక, మొరం తరలించిన చర్యలు తీసుకుంటాం. అనుమతి ప్రకారమే ఇసుక, మొరం తరలించాలి. అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవు.

రాత్రింబవళ్లు ఇసుక కొడుతున్నరు..

రఘురాం, పాటితండా



పర్మీషన్ పేరుతో రాత్రింభవళ్లు జేసీబీ ద్వారా ఇసుక కొడుతున్నారు. దీంతో భూగర్భ జలాలు ఇంకిపోయి పంటలు సైతం ఎండుతున్నాయి. స్థానిక తహశీల్దార్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

ఇసుక, మొరం రవాణాకు అడ్డుకట్ట వేయాలి..

సంతోష్, పాటితండా



జేసీబీలతో ఇసుక, మొరం అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లు, జేసీబీలను అధికారులు సీజ్ చేయాలి. లెక్కలేని ట్రాక్టర్లు, టిప్పర్లతో అక్రమ రవాణా చేస్తున్న అధికారులు స్పందించడం లేదు. అధికారులే స్పందించి చర్యలు తీసుకోవాలి.

భిక్కనూరు టు బెంగుళూరు

● ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను విమానంలో తీసుకెళ్లి ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఐ మల్లేష్

భిక్కనూరు, మే 22(ఆంధ్రజ్యోతి): భిక్కనూరుకు చెందిన గడ్డం మల్లేష్ తన విద్యను ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లోనే పూర్తి చేసుకుని ఎస్సైగా ఎంపికై ప్రస్తుతం హైదరాబాద్‌లోని జీడిమెట్ల సీఐగా విధులు నిర్వహిస్తున్నారు. విధులు నిర్వహిస్తూనే తాను క్రైం ఫీం ఇండియా పేరుతో యూట్యూబ్ చానెల్‌ను నిర్వహిస్తూ ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలు, తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు. ఈ నేపథ్యంలోనే తాను 10వ తరగతి వరకు చదువుకున్న పాఠశాలలో ఈ సంవత్సరం 10వ తరగతి పరీక్షల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో ఎక్కువ మార్కులు సాధించిన వారిని విమానం ఎక్కిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు 2025లో 10వ తరగతి ఫలితాల్లో ఎక్కువ మార్కులు సాధించిన భిక్కనూరు మండలంలోని ఆరుగురు విద్యార్థులను ఎంపిక చేసి గురు వారం ఇండిగో విమానంలో శంషాబాద్ నుంచి బెంగుళూరుకు తన సొంత ఖర్చులతో తీసుకెళ్లాడు.

ఆ ఆరుగురు విద్యార్థులు వీరే..

భిక్కనూరు టూ బెంగుళూరు కార్యక్రమంలో భాగంగా ఆరుగురు విద్యార్థులు బెంగుళూరు వెళ్లారు. వీరిలో జంగంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన సహస్ర, స్పందన, భిక్కనూరు బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన వంశిక, సహస్ర, భిక్కనూరు బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన మహేష్, నౌసేన్ ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించాలనే..

గడ్డం మల్లేష్, సీఐ జీడిమెట్ల

అన్ని వసతులు ఉన్న ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతోనే నేను, నా సతీమణి సుశీల ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదివే విద్యార్థుల్లో ఎక్కువ మార్కులు సాధించిన వారిని విమానం ఎక్కిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు ఆరుగురు విద్యార్థులను విమానం ఎక్కించడమే కాకుండా వారిని బెంగుళూరుకు తీసుకెళ్లి విశ్వేశ్వరయ్య విజ్ఞాన కేంద్రంతో పాటుగా ముఖ్యమైనా ప్రాంతాలు, ప్రదేశాలను, పట్టణ అందాలను చూపించడం జరిగింది. నేను, నా సతీమణి ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యను అభ్యసించాము. ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించాలన్న ఉద్ధేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టి దీనికి బీ టూ బీ (భిక్కనూరు టూ బెంగళూరు)గా నామకరణం చేశామన్నారు.


భిక్కనూరు విద్యార్థులతో బెంగుళూరుకు వెళ్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జన్మదినోత్సవం

- పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

నిజామాబాద్ కల్చరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): రామదూత హనుమాన్‌కి జై అంటూ భక్తులు హనుమంతుడిని భక్తిశ్రద్ధలతో పూజించారు. వైశాఖ బహుళ దశమి పూర్వభద్ర నక్షత్రంలో జన్మించిన హనుమంతుడి జన్మదినోత్సవ వేడుకలను గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. జన్మదినాన్ని పురస్కరించుకొని ఆలయాల్లో మూలవిగ్రహానికి మన్య సూక్తంతో వేదపండితులు పంచామృతాభిషేకాలు నిర్వహించి సింధూరం, తమలపాకు, వడ, జిల్లెడు పూలతో విశేష పూజలు జరిపారు. పలు ఆలయాల్లో వేదమంత్రాలతో హనుమత్ హోమాన్ని నిర్వహించి అన్నప్రసాదాన్ని జరిపారు. ఆలయాల్లో స్వామికి భక్తులు విశేష పూజలు నిర్వహించడంతో పాటు ఆలయాల్లో జరిగిన సామూహిక హనుమాన్ పూజలో పాల్గొన్నారు. శ్రీనివాస్‌నగర్ కాలనీలోని హనుమాన్ దేవాలయంలో అర్చకులు కొత్తపల్లి శ్రీకాంతచార్య హనుమంతుడికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతి నిధులు గంగారెడ్డి, అశోక్, సంజీవ్‌రెడ్డి, గంగామోహన్, సారంగపాణి రఘు, రాజు, తదితరులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రసిద్ధ హను మత్ క్షేత్రంగా విరాజిల్లుతున్న గోల్‌హనుమాన్ దేవాలయం, సుభాష్‌నగర్ రామాలయం హనుమాన్ దేవాలయం, హనుమాన్‌జంక్షన్‌లోని హను మాన్ దేవాలయం, నీలకంఠేశ్వర్ ఆలయంలోని హనుమాన్ దేవాలయం, నీరుగొండ హనుమాన్, బోధన్‌లోని మారుతి హనుమాన్ ఆలయం, ఆర్మూర్‌లోని జంబి హనుమాన్ తదితర ఆలయాల్లో ఘనంగా హనుమాన్ జన్మదినోత్సవాన్ని నిర్వహించారు.


గోల్‌హనుమాన్ ఆలయంలోని మూలవిగ్రహం


సామూహిక పూజలు చేస్తున్న భక్తులు


బోధన్ మారుతి మందిరంలో..

వేల్పూర్‌లో

వేల్పూర్ : మండల కేంద్రంలో పాత కచేరి వద్ద ఉన్న హనుమాన్ ఆలయంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ పురోహితుడు కరుణాకర్ శర్మ మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక అలంకరణ, పంచామృత అభిషకం, హారతి భక్తుల ప్రసార వితరణ, ప్రత్యేక పూజలు వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

బోధన్ మారుతీ మందిరంలో..

బోధన్‌రూరల్: పట్టణంలోని మారుతీ మందిరంలో గురువారం పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ప్రవీణ్ మహరాజ్ ఆధ్వర్యంలో మారుతి మందిరంలో మహ అభిషేకం, పంచామృత అభిషేకం. హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోర్టు న్యాయమూర్తి శేషతల్ప సాయి, ఏసీపీ దంపతులతో పాటు హనుమాన్ గురుస్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వాహనదారుడు ధ్రువపత్రాలు కలిగి ఉండాలి

సదాశివనగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలను వాహనదారులు దగ్గర ఉంచుకోవాలని ఎస్సై రంజిత్ అన్నారు. గురువారం మండలంలోని పద్మాజీవాడి శివారుప్రాంతం గాంధారి రోడ్డులో వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రోడ్డు నిబంధనల ప్రకారమే ప్రతిఒక్కరూ వాహనాలను నడపాలని, పనుల మీద బయటకు వెళ్లేటప్పుడు ఖచ్చితంగా హెల్మెట్ ధరించి బయటకు రావాలన్నారు. ప్రతి వాహనదారుడు ధృవీకరణ పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. రోడ్డు నియమాలను పాటించని వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు.

బాలుడిపై పిచ్చికుక్క దాడి


కుక్కదాడిలో గాయపడిన బాలుడు

బిచ్కుంద, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లమ్మకుచ్చలో పిచ్చి కుక్కదాడిలో రాంచందర్ అనే బాలుడికి తీవ్రగాయాలయ్యాయి. బాన్సువాడకు చెందిన బాలుడు కుటుంబసభ్యులతో బిచ్కుందలోని ఎల్లమ్మకుచ్చకు బంధువుల ఇంటికి వచ్చాడు. వీధిలోని కుక్కబాలుడిని పలుచోట్ల కరిచి గాయపరిచింది. గాయపడిన బాలుడిని వెంటనే ప్రభుత్వఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

దత్తాత్రేయ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు


పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

గాంధారి, మే 22(ఆంధ్రజ్యోతి): మండలంలో నూతనంగా నిర్మించిన దత్తాత్రేయ ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లమడుగు సురేందర్ గురువారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాన్ని అద్భుతంగా నిర్మించారని అన్నారు. మాజీఎమ్మెల్యేకు ఆలయ కమిటీసభ్యులు ఘనస్వాగతం పలికారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

● వ్యవసాయ అధికారి రాజు


మద్నూర్‌లో విత్తనాల దుకాణాలలో రిజిష్టర్‌లను పరిశీలిస్తున్న ఏవో

మద్నూర్, మే 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలో విత్తనాలు విక్రయించే దుకాణాలను మండల వ్యవసాయ అధికారి రాజు తనిఖీ చేశారు. విత్తన దుకాణాలలో రిజిస్టర్‌లను పరిశీలించి యాజమాన్యానికి సూచనలు చేశారు. ముఖ్యంగా వానాకాలం సీజన్ ప్రారంభం అయింది. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. విత్తన డీలర్లు తెచ్చుకున్న విత్తనస్టాక్స్ ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలని, అలాగే ఏయే ఏ స్టాక్స్ ఏ కంపెనీ స్టాక్ తెచ్చుకున్నారో వాటి పీసీలు, బిల్స్, ఇన్వైస్ పెట్టుకోవాలనీ తెలిపారు. రైతులకు విక్రయించిన విత్తనాలకు సంబంధించిన రసీదు తప్పకుండా ఇవ్వాలని సూచించారు. రైతులు ప్యాకింగ్ లేని విత్తనాలు కొనొద్దని, అలాగే మధ్య దళారుల దగ్గర కాకుండా లైసెన్స్ ఉన్న డీలర్ల దగ్గరే విత్తనాలు కొనుగోలు చేయాలని తెలిపారు. విత్తన డీలర్లు ఎవరైనా పత్తి, సోయా విత్తనాలను అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలి : ఏవో భవాని


స్టాక్ రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారి భవాని

నసురుల్లాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌లో వ్యవసాయం చేసే రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలని మండల వ్యవసాయ శాఖ అధికారిని భవాని అన్నారు. గురువారం మండలంలోని మైలారం సొసైటీని ఆకస్మికంగా తనిఖీ చేసి స్టాక్ రిజిస్టార్‌ను పరి శీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ ఎరువులను అందించి, స్టాక్ కొరత లేకుండా చూడాలన్నారు. ఆమె వెంట సొసైటీ సిబ్బంది ఉన్నారు.

తిప్పాపూర్‌లో చర్చి నిర్మాణానికి విరాళం అందజేత

భిక్కనూరు, మే 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న జోలోస్ మినిస్ట్రీస్ ఆఫ్ చర్చి నిర్మాణానికి గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీంరెడ్డి రూ.10వేల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కుంట లింగారెడ్డి, స్వామి, సిద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు ఉన్న పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలి

కామారెడ్డిటౌన్, మే 22(ఆంధ్రజ్యోతి):జిల్లాలో గుర్తింపు ఉన్న పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని డీఈవో రాజు తెలిపారు. ప్రైవేట్ స్కూల్స్ అడ్మిషన్‌ల కోసం ప్రచారం చేస్తున్నట్లు ఆరోపణలు రావడంతో సంబంధిత మండల విద్యాశాఖాధికారిని సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకుని మాత్రమే అడ్మిషన్‌లు తీసుకోవాలని తెలిపారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని స్టేషన్ రోడ్డులో గల నారాయణస్కూల్, అశోక్‌నగర్‌లోని వీఐపీ యూనివర్సల్ స్కూల్, పంచముఖి హనుమాన్ కాలనీలో ప్రెసిడెన్షియల్ స్కూల్, దేవివిహార్ ఫేజ్-2లో గల ఆరంభస్కూల్, అశోక్ నగర్ కాలనీలోని శ్లోక్ స్కూల్ సెకండ్ బ్రాంచ్, విద్యానగర్ కాలనీలోని చాంపియన్స్ రోజ్‌వుడ్ స్కూల్, విద్యానగర్ కాలనీలోని వివేకానంద బీ టాపర్స్ స్కూల్‌కు అనుమతులు లేవని తెలిపారు. గుర్తింపు లేని పాఠశాలలో చేర్పించితే తల్లిదండ్రులదే పూర్తి బాధ్యత అని తెలిపారు.


కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగిస్తున్న దృశ్యం

నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు

పెద్దకొడప్‌గల్, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటేపల్లి గ్రామంలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించినట్లు ఏఈ పవన్ తెలిపారు. గ్రామానికి విద్యుత్ అందించే ట్రాన్స్‌ఫార్మర్ గతంలో 15 కేవీ ఉండగా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందడం లేదని 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించడం జరిగిందని తెలిపారు. దీంతో పాటుగానే గ్రామంలో లక్ష్మీమాత ఆలయం వద్ద తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లను ఎత్తు పెంచడం జరిగిందన్నారు.

ధాన్యం బస్తాలను వెంటనే తరలించండి

● అదనపు కలెక్టర్ విక్టర్

దోమకొండ , మే 22(ఆంధ్రజ్యోతి): : రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో ఉన్నటువంటి బస్తాలను వెంటనే తరలించాలని అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. వర్షానికి తడిసిన బస్తాలను లారీలో రైస్‌మిల్‌కి పంపించి రైస్‌మిల్లర్లకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. దోమకొండలో ఇప్పటివరకు 463 మంది రైతుల వద్ద నుంచి 71,985 బస్తాలను కొనుగోలు చేసినట్లు సీఈవో బాల్‌రెడ్డి తెలిపారు. అలాగే ముత్యంపేటలోని విండోపరిధిలో చింతమాన్‌పల్లి, ముత్యంపేట గ్రామాల్లో 54 వేల బస్తాలను కొనుగోలు చేశామని తెలిపారు. కేంద్రాల్లో ఉన్నటువంటి బస్తాలను లారీలను ఏర్పాటు చేసుకుని గురువారం సాయంత్రం లోగా రైస్‌మిల్లులకు పంపించామని పూర్తిచేయాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో మల్లిఖర్జున్, ఆర్డీవో, తహసీల్దార్ సంజయ్‌రావు, విండో ఛైర్మన్ నాగరాజ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, అనంత్‌రెడ్డి, మధు, గోపాల్‌రెడ్డి, ఏఈవో మాన్యాష, సీఈవో బాల్‌రెడ్డి నవీన్ పాల్గొన్నారు.


దోమకొండలో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

'భూగర్భ జలాల పెరుగుదలకు కృషి చేయాలి'

భిక్కనూరు, మే 22(ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాల పెరుగుదలకు కృషిచేయాలని అడిషనల్ కలెక్టర్ చందర్‌నాయక్ అన్నారు. గురువారం మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో మురికికాలువ చివరిభాగంలో ఎస్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న ఇంకుడు గుంతను అడిషనల్ కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలను నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపు నీరు, మురికికాలువల నీరు ఇంకుడుగుంతలోకి చేరడం ద్వారా భూగర్భ జలాల పెరుగదలకు ఉపయోగపడతాయన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి మండల అధికారులతో సమావేశం నిర్వహించి మండల అభివృద్ధి, ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువవికాసంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్‌ను ఏఎంసీ వైస్ ఛైర్మన్ స్వామి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, ఏపీవో రాధిక, ఈవో లక్ష్మీ పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు

● జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు

మద్నూర్, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇండ్లను దారిద్రరేఖకు దిగువన ఉన్న నిరుపేదలందరికీ రాష్ట్ర ప్రభుత్వం నిబంధనల మేరకు ఇవ్వడం జరుగుతుందని జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతరావు అన్నారు. గురువారం మండలంలోని పెద్దశక్కర్గ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన వారికి సర్టిఫికెట్లను అందజేసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పేదలందరికీ ఇండ్లు ఇవ్వడం జరుగుతుందని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిలు, సలాబత్పూర్ ఆలయ కమిటీ ఛైర్మన్ రామ్ పటేల్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు హనుమాన్లు స్వామి, సింగిల్ విండో ఛైర్మన్ శ్రీనివాస్ పటేల్, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ పరమేష్ పటేల్, నాయకులు అమూల్ షిండే, ఎంపీడీవో రాణి తదితరులు పాల్గొన్నారు.

పిట్లం : ప్రజాప్రభుత్వంలో ఇళ్లు లేని అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజురు చేయడం జరుగుతుందని జుక్కల్ ఎమ్మెల్యే తోటలక్ష్మీకాంతారావ్ అన్నారు. గురువారం పిట్లం ఎస్సీ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఎమ్మెల్యే భూమిపూజ చేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు హన్మాండ్లు, నాయకులు రాంరెడ్డి, మోహన్‌రెడ్డి, అశోక్, శివ, వెంకట్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇండ్లకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు

నసురుల్లాబాద్ : అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని, అర్హులైన లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోవాలని ఎంపీడీవో సూర్యకాంత్ అన్నారు. గురువారం మండలంలోని కంశేట్ పల్లి గ్రామంలో అధికారులు, లబ్ధిదారులతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్ర మంలో ఎంపీవో వెంకటరమణ, హౌసింగ్ ఏఈ పాల్గొన్నారు.

జుక్కల్ : జుక్కల్ మండలంలో లొంగన్ గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారులను గుర్తించి వారి ఇంటి నమూనాను ఇల్లు నిర్మించు కోవడానికి ముగ్గు వేసినట్లు మండల ఏపీవో రాము తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ లబ్ధిదారులు తక్కువ పెట్టుబడితో ఇల్లు నిర్మించుకోవాలని ఆయన అన్నారు. ప్రభుత్వం ఇళ్లు నిర్మించుకున్న వారికి విడతలవారీగా డబ్బులు చెల్లిస్తుందని ఆయన అన్నారు.

భిక్కనూరు : మండలంలో అర్హులైనా ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందని గ్రంథాలయ సంస్థ జిల్లా ఛైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని లక్ష్మీదేవునిపల్లి గ్రామంలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేయడంతో పాటుగా భూమి పూజ చేశారు.

దోమకొండ : మండల కేంద్రంలో గురువారం పంచాయతీ కార్యదర్శి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఆర్డర్ కాపీలను అందజేసి నిర్మాణ పనులను ప్రారంభించారు.

భాగ్యరెడ్డి వర్మకు ఘన నివాళి

కామారెడ్డిటౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : దళిత నాయకుడు, సంఘసంస్కర్త భాగ్యరెడ్డి వర్మ జయంతి సందర్భంగా జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రాజేష్‌చంద్ర ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్ర మంలో ఏఎస్పీ నరసింహరెడ్డి, డీఎస్పీలు మదన్‌లాల్, యాకుబ్‌రెడ్డి, ఏవో ఎండీ అప్సర్, సీఐ, ఎస్ఐలున్నారు.

పరీక్ష కేంద్రం పరిశీలన

ఇంటర్‌మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్ష కేంద్రాలను గురువారం ఎస్పీ రాజేష్ చంద్ర పరిశీలించారు. శ్రీసాందీపని కళాశాలలో భద్రత ఏర్పాట్లను పరిశీలించి విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు.

పోలీసులకు అభినందనలు

ఏఎస్ఐ నుంచి ఎస్ఐలుగా పదోన్నతి పొందిన 11 మంది పోలీసులను గురువారం ఎస్పీ రాజేష్‌చంద్ర అభినందించారు. పోలీసు వ్యవస్థలో నిరంతరంగా సేవలందించి పదోన్నతి పొందుతున్న రామారెడ్డి పోలీసుస్టేషన్ ఏఎస్ఐ లచ్చిరాం, ఎల్లారెడ్డిపోలీసు స్టేషన్ ఏఎస్ఐ సిద్దిఖీ, భిక్కనూరు పోలీసుస్టేషన్ ఏఎస్ఐ మల్లారెడ్డి, పెద్దకొడప్‌గల్ పోలీసుస్టేషన్ ఏఎస్ఐ రాములు, మాచారెడ్డి పోలీసుస్టేషన్ ఏఎస్ఐ నర్సింలు, గాంధారి పోలీసుస్టేషన్ ఏఎస్ఐ గణేష్, పిట్లం పోలీసుస్టేషన్ ఏఎస్ఐ లింబాద్రి, నాగిరెడ్డిపేట పోలీసుస్టేషన్ ఏఎస్ఐ ఉమేష్, దోమకొండ పోలీసుస్టేషన్ ఏఎస్ఐ సుబ్రహ్మణ్యచారి, తాడ్వాయి పోలీసుస్టేషన్ ఏఎస్ఐ సంజీవ్, ఇంటలిజెన్స్ ఏఎస్ఐ హన్మగౌడ్‌లకు చిహ్నాలు అలంకరించారు.


భాగ్యరెడ్డి వర్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎస్పీ

బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


బరంగేడ్గిలో బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

బీర్కూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బరంగేడ్గి గ్రామంలో గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. బరంగేడ్గి గ్రామానికి చెందిన మేత్రి భూమయ్య అనే వ్యక్తికి 37 వేల 500, గొండ్ల చిన్న గంగారాం అనే వ్యక్తికి 20 వేల రూపాయల విలువైన చెక్కులను అందజేశారు. బాధితులు ఇరువురు కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రుల్లో చికిత్స పొందారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్, దేవానంద్, దేశ్‌ముఖ్, రమేష్, గంగారాం, లక్ష్మణ్, నాగుగొండ, వీరప్ప, కామప్ప తదితరులు పాల్గొన్నారు.

నెమలి సాయి ఆలయంలో పూజలు

నసురుల్లాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెమలి ఆలయంలో గురువారం భక్తులు సాయి ఆలయాన్ని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు మాట్లాడుతూ నెమలి సాయి ఆలయం మినీ షిరిడిగా అవతరించిందన్నారు. అనంతరం ఆలయకమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే తోట


బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తోట

పెద్ద కొడప్‌గల్, మే 22 (ఆంధ్రజ్యోతి): పెద్దకొడప్‌గల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కిష్టారెడ్డి గత కొద్ది రోజుల క్రితం మరణించారు. విషయం తెలుసుకున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ గురువారం కిష్టారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా తోట మాట్లాడుతూ కిష్టారెడ్డి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని, చాలా ఏళ్ళుగా కిష్టారెడ్డి పార్టీ కోసం పనిచేసిన విషయం గుర్తు చేశారు. పార్టీ కోసం పనిచేసిన కిష్టారెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్ర మంలో పిట్లం మార్కెట్ కమిటీ ఛైర్మన్ మనోజ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, నిజాంసాగర్ మండల పార్టీ అధ్యక్షులు మల్లిఖార్జున్, నాయకులు అడ్వకేట్ రాంరెడ్డి, నాయకులు చిప్ప మోహన్, నాగిరెడ్డి, శ్యామప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదస్థలాన్ని పరిశీలించిన అధికారులు


ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పెద్దకొడప్‌గల్, మే 22 (ఆంధ్రజ్యోతి): 20 రోజుల క్రితం పెద్ద కొడప్‌గల్ గ్రామశివారు 161వ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో గ్రామానికి చెందిన పీఎంపీ పండరి మరణించా రు. దీంతో ఘటన జరిగిన ప్రాం తాన్ని బిచ్కుంద సీఐ నరేష్, ఏఎం వీఐ రజనీ, పెద్దకొడప్‌గల్ ఎస్ఐ మహేందర్‌తో పాటు జాతీయ రహదారి భద్రత విభాగం అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ నరేష్ మాట్లాడుతూ గతంలో జరిగిన రహదారి ప్రమాదంలో గ్రామానికి చెందిన పండరి మరణించడం జరిగిందని, ప్రమాదం జరి గిన తీరుతెన్నుల గురించి పరిశీలించి రానున్న రోజుల్లో ఇటువంటి ఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. ఈ ప్రమాదంపై విచారణ చేసి తాము ఏఆర్‌టీ వారికి నివేదిక అందజేస్తామని తెలిపారు. వాహనదారులు కూడా 161వ జాతీయ రహదారిపై ప్రయాణించే సమయం లో రహదారి భద్రత నియమాలు పాటించాలని సూచించారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

కామారెడ్డిటౌన్, మే 22(ఆంధ్రజ్యోతి):కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్‌లో వ్యవసాయశాఖాధికారులు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన చేపట్టారు.ఈ సందర్భంగా యూరియా వాడకం, సాగుఖర్చుతగ్గించుకోవడం,భూసారం కాపాడడం, విత్తన,పురుగులమందు కొనుగోలు, రశీదులు భద్రపరచడం తదితర అంశాలను వివరించారు.ఈ కార్యక్రమంలో ఏడీఏ అపర్ణ, ఏవో పవన్‌కుమార్,ఏఈవో తేజస్విని, శాస్త్రవేత్తలు నవీన్, రేవంత్, హార్టికల్చర్ ఆఫీసర్ సంతోషి, హెచ్‌సీయూ జీఎం అశోక్, మాజీ కౌన్సిలర్‌లు శ్రీనివాస్, సుగుణ,రైతులు రాంరెడ్డి, ఆంజనేయులు,బాపురెడ్డి, రాంరెడ్డి, రాజేందర్, లింగం, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు


రైతుల వివరాలను నమోదు చేస్తున్న అధికారులు

దోమకొండ, మే 22(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వ పథకాల అమలులో కీలకం అయినటువంటి ప్రత్యేక రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యకు సంబంధించిన ప్రక్రియను రైతు వేదికలో అధికారులు నమోదు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏవో మణిదీపిక మాట్లాడుతూ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ నంబర్‌కు జత చేసిన ఫోన్‌నంబర్, ఆధార్ కార్డు అధికారులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు క్రిష్టారెడ్డి, మాన్యాష, రైతులు పాల్గొన్నారు.

భిక్కనూరులో వర్షానికి కూలిన రెండు ఇళ్లు


కూలిపోయిన ఇళ్లను పరిశీలిస్తున్న దృశ్యం

భిక్కనూరు, మే 22(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా ఈదురు గాలులతో కురుస్తున్న భారీ వర్షానికి భిక్కనూరు మండలకేంద్రంలో రెండు ఇండ్లు కూలినట్లు ఈవో మహేష్‌గౌడ్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి కుసలకంటి పోచమ్మ, బసగల్ల ఎల్లయ్య ఇండ్లు స్వల్పంగా దెబ్బతిన్నాయని తెలిపారు. దెబ్బతిన్న ఇండ్లను ఆర్ఐ బాలయ్య పరిశీలించి బాధితుల వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు.

ఆపరేషన్ సిందూర్‌కు మద్దతు తెలిపిన తపాస్


వీర జవాన్‌లకు మద్దతు తెలుపుతున్న తపాస్‌నాయకులు

కామారెడ్డిటౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో జరిగిన ఉగ్రవాద చర్యలను ఖండిస్తు భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌కు తపాస్ నాయకులు మద్దతు ప్రకటించారు. యుద్ధంలో వీరమరణం పొందిన అమరజవానులకు ఘననివాళి అర్పిస్తు పాకిస్తాన్‌లోని ఉగ్రముఖలను మట్టుపెట్టిన జవాన్‌లకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో తపాస్ జిల్లాఅధ్యక్షుడు రాఘవరెడ్డి, రాష్ట్రబాధ్యులు రామచంద్రం, జిల్లా బాధ్యులు లక్ష్మీపతి, రాజశేఖర్, పవన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై ఆర్‌అండ్‌బీ శాఖాధికారులకు అవగాహన

కామారెడ్డిటౌన్,మే 22(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక కేంద్రంలో గురువారం ఆర్‌అండ్‌బీ శాఖాధికారులకు అగ్నిమాపక శాఖ అధికారి సుధాకర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. వంటగది సిలిండర్ లికేజీ ప్రమాదాలను తినేసోడాతో ఆర్పివేసే పద్దతి, ఆయిల్‌ఫైర్‌లను మూత కప్పి ఉంచి ఆర్పివేయు పద్దతి, పిడుగుపాటు సమయంలో పాటించాల్సిన మెలుకువలు, వివిధ రకాల అగ్నిప్రమాదాలపై ఉపయోగించే పరికరాలపై వివరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఓ అబ్దుల్ సలాం, డీఈ రమాదేవి, ఏఈ తురబ్, డీఏఓ సంతోషి పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

దోమకొండ, మే 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ వీరబ్రహ్మంగారి ఆలయంలో బుధవారం రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు హుండీని పగులగొట్టి అందులోని డబ్బులను ఎత్తుకెళ్లినట్లు ఎస్సై ప్రవంతి గురువారం తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కంది రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి
దర్శన్ - మిషన్ ఇంపాసిబుల్
ప్రియా 70 - ఎలివన్
ప్రియా 35 - సింగిల్

బాన్సువాడ
మహేశ్వరి జగదేకవీరుడు అతిలోక సుందరి
వెంకటేశ్వర - మన కుటుంబం

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	170
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

